క్లుప్తంగా

రామలింగేశ్వరాలయంలో శాస్త్రీయ సంగీత కచేరీ



గీతాలు పాడుతున్న రుషిపీఠం విద్యార్థులు

సీతంపేట : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శంకరమఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ భక్తులను అలరించింది. రుషిపీఠం సంస్కృతి పాఠశాల విద్యార్థులు వివశ్వంత్, శౌర్య, ప్రణవ్, సుహాస్, నిరత్యయ, వైష్ణవి ఆధ్యాత్మిక గీతాలు, స్తోత్రాలు ఆలపించారు. నమక, చమకములు, శివమానస పూజ, శివతాండవ స్తోత్రం, నామ రామాయణం, శివాష్టకం, రఘువీర గద్యం, శివతాండవ భక్తి పాటలు మధురంగా ఆలపించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



కేడీవీ నరసింహారావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు, అధ్యాపకులు

మురళీనగర్ : ఇటీవల నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ హెడ్ కేడీవీ నరసింహారావును అధ్యాపక సిబ్బంది ఆదివారం సత్కరించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆయనను సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. నరసింహారావు మరిన్ని అవార్డులు పొందాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, వివిధ విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు. తనను సత్కరించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు, డిపార్టుమెంట్ హెడ్‌లకు నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

వరప్రసాద్‌కు సత్కారం

మురళీనగర్ : కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మురళీనగర్‌కు చెందిన సనపల వరప్రసాద్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం ఆదివారం సత్కరించింది. మురళీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు తోకడ రాము ఆధ్వర్యంలో సభ్యులు వరప్రసాద్‌ను సాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కె.సత్యరాజ్ జైనాథ్, మాస్టర్ రాము, అడ్డూరి శ్రీనివాసరావు, తోకడ ఈశ్వరరావు, కప్పిరెడ్డి అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన వినోదవల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వినోద వల్లరి కెమెడీ స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పండించాయి. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లబ్ కళాకారులు ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ సందర్భంగా ఏఎంసీ మెడిసన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎ.నాయక్‌ను సత్కరించారు. చిన్నారులు మేడా అన్విత, అభిరామ్ పాడిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. అనంతరం తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ పాడిన పేరడీ గీతాలు, వింజమూల రామకుమార్ పాడిన హిందీ గీతాలు ఆహూతులను హుషారెత్తించాయి. పి.కె.దుర్గాప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



పాలకర్ర మొక్క



బొద్ద మొక్క



మంచి గంధం మొక్క



పొగడ మొక్క



గంగరావి చెట్టు

విభిన్న వృక్ష సమాహారం

అరుదైన వృక్షాలతో వాకర్స్ పార్కు



బేడ మొక్క

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కు పచ్చదనానికి పెట్టింది పేరు. పార్కు నిర్వహణలో వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పచ్చదనంతోపాటు ఆహ్లాదకర వాతావరణానికి ఆలవాలంగా నిలుస్తోంది. పార్కులో అరుదైన వృక్షజాతులతోపాటు ఆయుర్వేద వైద్యానికి ఉపయోగపడే మొక్కలు చూడవచ్చు. ఇక్కడికి వచ్చిన వారికి వ్యాయామంతోపాటు ఆరోగ్యపరమైన వాతావరణం లభిస్తుంది. కావాల్సినంత ప్రాణవాయువుని పొందవచ్చు.

బోధి నుంచి బొద్ద వృక్షం వరకు...

బుద్ధ భగవానుడు ధ్యానం చేసిన బోధి వృక్షం ఈ పార్కులో కనిపిస్తుంది. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు రాళ్లపల్లి సత్యనాథం ఆయన భార్య వృక్ష మిత్ర అన్నపూర్ణమ్మ స్మృత్యర్థం ఈ మొక్కను 2011లో నాటారు. ఆయన ఇంటిలో ఉన్న రెండేళ్ల మొక్కను తీసుకొచ్చి ఇక్కడ నాటారు. ఈ వృక్షం కనిపించడం చాలా అరుదు. హిమాలయ, బుద్ధగయలో మాత్రమే కనిపిస్తుంది. ఈ మొక్కను అన్నపూర్ణమ్మ బెంగళూరు నర్సరీ నుంచి రప్పించి ఇక్కడ నాటారు. ఇక్కడ మంచి గంధం, రుద్రాక్ష, జువ్వి, రావి, బొద్ద, పొగడ, బాదం, ఎర్రచందనం, జమ్మి, తదితర మొక్కలున్నాయి.

వృక్షమిత్ర అవార్డు అందజేత

ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు పార్కును సందర్శించినప్పుడు వృక్ష సంపదను పరిశీలించి రోజూ 90 నుంచి 120 టన్నుల ప్రాణవాయువు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. వృక్ష మిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నుంచి 2008లో వృక్షమిత్ర అవార్డును వాకర్స్ పార్కుకు అందజేశారు. అత్యధికంగా ఆక్సిజన్ ఉత్పత్తి చేసే గంగిరావి చెట్లు ఇక్కడ ఉన్నాయి. ఆకులు పెద్దవి, దలసరిగా ఉండేవి ఎక్కువ ఆక్సిజన్ ఇస్తాయనే సూచన మేరకు 1997లో ఈ మొక్కలు నాటారు.

పూజలు, వ్రతాలకు ఉపయోగపడేలా...

శుభకార్యాలకు ఉపయోగించే కొమ్మలు, ఆకులు లభించే చెట్లు ఇక్కడ చాలా ఉన్నాయి. ముఖ్యంగా అత్యంత అరుదైన పాలకర్ర చెట్టును ఇక్కడ చూడవచ్చు. పెండ్లిరాటలు, పెండ్లి పందిరికి దీని కర్రను ఉపయోగించేవారు. ఈ మొక్కలు ప్రస్తుతం లభ్యం కాకపోవడంతో చాలా మంది నేరేడు, ఇతర కొమ్మలను వాడుతున్నారు. గణేష్ పూజ, ఇతర దేవుళ్ల పూజలు, వ్రతాలకు ఉపయోగించే పూజా ద్రవ్యాలకు సంబంధించి 14 రకాల పత్రాలకు చెందిన చెట్లు ఇక్కడ నాటారు. ప్రస్తుత వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ఆధ్వర్యంలో వీటిని ప్రత్యేకంగా తీసుకొచ్చి నాటారు. మారేడు (బిల్వ), తులసి, జిల్లేడు, రేగు, ఉమ్మెత్త, గన్నేరు, రావి, ఉసిరిక, మామిడి, జామ తదితర చెట్లు ఉన్నాయి. వీటితో పాటు తాళ వృక్షాలు, అశోక, వేప, అశ్వర్థ, జమ్మి, జువ్వి, పొగడ, సపోట, నేరేడు, బాదం చెట్లు ఉన్నాయి. ఎన్నో తుఫానులను తట్టుకుని ఇవి నిలబడ్డాయి.

అందుబాటులో ఆయుర్వేద వైద్య మొక్కలు

ఆయుర్వేదానికి ఉపయోగపడే నేల వాము, నేల ఉసిరి, రాక్షస ఉసిరి వంటి ఆయుర్వేద ఔషధ మొక్కలు కూడా పార్కులో ఉన్నాయి. ఖర్జూరం, ఆల్‌బుకార, కాఫీ, సైకస్ వృక్షాలు ఉన్నాయి. బ్రెజిలియన్ రెయిన్‌ట్రీ అనే చెట్టు, మేడి చెట్టును ఇక్కడ చూడవచ్చు. త్రిమూర్తులు రావి చెట్టుపైన, విష్ణుమూర్తి మేడి (అత్తి) చెట్టుపై కొలువై ఉంటారని ప్రతీతి. అడీనియమ్ పాటెడ్ ప్లాంట్స్ కూడా ఇక్కడ ఉన్నాయి. పనస, సపోట వంటి ఫల వృక్షాలు ఉన్నాయి.



జువ్వి చెట్టు

మినీ నేచురల్ పార్కు

నేటి తరానికి పరిచయం లేని అంతరిస్తున్న వృక్ష జాతికి చెందిన మొక్కలు ఈ పార్కులో చూడవచ్చు. ఈ మొక్కలను చూడడానికి నేచురల్ పార్కుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడ చూడవచ్చు. పిల్లలు, పెద్దలు వాకింగ్‌కి వచ్చినప్పుడు యాంత్రికంగా విశ్రాంతి తీసుకుని వెళ్లిపోకుండా వీటి వివరాలను తెలుసుకుంటూ విజ్ఞానం పొందవచ్చు. గ్రామాల్లో మాత్రమే కనిపించే చెట్లు, మొక్కలతోపాటు, అడవుల్లో పెరిగే మొక్కలు లభిస్తాయి. ఇవి పక్షులకు నివాస ప్రాంతాలుగా ఉపయోగపడుతున్నాయి.



గన్నేరు

మొక్కలంటే ప్రాణం

హుద్‌హుద్‌లో 52 మొక్కలు కూలిపోయాయి. అంతా అతలాకుతలమైంది. ఆ పరిస్థితి చూసి కన్నీళ్లు పెట్టుకున్నాం. వాటి స్థానంలో కొత్తవి నాటాం. పచ్చదనాన్ని పెంపొందించడానికి నిరంతరం శ్రమించాం. ఇప్పుడున్న వృక్షాలను పసివాళ్లను సాకినట్లు 27 ఏళ్లగా పెంచుతున్నాం. కొమ్మలు తీయాలన్నా ప్రాణం పోయినట్లు ఉంటుంది.

– ఆర్.సత్యనాథం, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు

వృక్ష సంరక్షణకు ప్రాధాన్యం

పార్కులో వృక్ష సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. అరుదైన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రస్తుత తరాలతో పాటుభవిష్యత్ తరాలకు వీటి ప్రాధాన్యత తెలిపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో కొత్త మొక్కలు నాటాలని నిర్ణయించాం. త్వరలో చెట్ల పేర్లను తెలిపే బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– పల్లా చంద్రమౌళి, అధ్యక్షుడు, వాకర్స్ క్లబ్

అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ విజయ్‌కుమార్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార : సమాజంలో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణాలు, మద్యం షాపుల వద్ద అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలుగుతున్నారో..? లేదో..? అని నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. గొడవలకు దూరంగా కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలని సూచించారు.

- ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లను హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంటుందని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొబైల్స్‌కన్నా పుస్తక పఠనంతో మేలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

మద్రిపాలెం : ప్రస్తుత సమాజంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాధవ్‌నగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఆర్ లైబ్రరీలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల కన్నా విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం లభిస్తుందన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతోపాటు దేశ నాయకుల జీవిత చరిత్రలు చదవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే గ్రంథాలయాలను అలవాటు చేయాలని సూచించారు. గ్రంథాలయాల్లో పెద్దలకు వార్తా పత్రికలు కూడా అందుబాటులో ఉంటాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్ పార్కు అధ్యక్షుడు అన్నెపు నారాయణరావు, పోర్టు పింఛనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, కార్యదర్శి బుడుమూరు శ్రీను, ఉపాధ్యక్షుడు వై.నూకరాజు, ఎస్.ఎస్.రావు, ఎస్.అప్పారావు, ఆర్.ఎస్.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు మాధవనగర్, మురళీనగర్, కళింగనగర్ వాస్తవ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు సభ్యత్వ నమోదు

మురళీనగర్ : మురళీనగర్ మహిళలు, బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 7వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ధరావత్తు సేకరించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థుల నుంచి గ్రంథాలయ సభ్యత్వాలు స్వీకరించారు. వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది చిన్నారులు గ్రంథాలయ పాఠక సభ్యులుగా చేరి తమ ధరావత్తును చెల్లించారు. అనంతరం విద్యార్థులకు ''వుయ్ లవ్ రీడింగ్'' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేశారు.



సభ్యత్వ నమోదు రసీదులు అందుకుంటున్న విద్యార్థులు

అలంకారప్రాయంగా టైమింగ్స్ డిస్‌ప్లే బోర్డు

సీతమ్మధార : జోన్ – 3 పరిధిలో గల బస్ షెల్టర్ల వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ టైమింగ్స్ డిస్‌ప్లే బోర్డులు నిరుపయోగంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడేళ్ల క్రితం నగరంలోని బస్‌షెల్టర్ల వద్ద ఆధునిక టైమింగ్స్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం కూడా చేశారు. మొదట్లో ఏపీఎస్ ఆర్టీసీకి స్వాగతం అంటూ డిస్‌ప్లే వచ్చేది. తర్వాత కొన్ని రోజులు ఆర్టీసీ బస్సుల నంబర్లు, అవి ఇక్కడకు వచ్చే సమయాలు డిస్‌ప్లే అయ్యేవి. కాలక్రమంలో ఈ బోర్డులన్నీ అలంకారప్రాయంగా మారిపోయాయి. రెండు సంవత్సరాలుగా బోర్డులు పనిచేయడం లేదని, ఏ విషయమూ డిస్‌ప్లే కావడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. గురుద్వారా బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నా జీవీఎంసీ, ప్రజారవాణాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఆరిలోవ వెళ్లే 69, ఎంవీపీ కాలనీకి వెళ్లే 540, మద్దిలపాలెం వెళ్లే 541, విజయనగరం వెళ్లే 111వీ, 222వీ కూర్మన్నపాలెం వెళ్లే 111, శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే పల్లెవెలుగు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ఇక్కడ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే డిస్‌ప్లే బోర్డు పనిచేయకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక, అధిక సమయం వేచి వుండలేని ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి డిస్‌ప్లే బోర్డులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గురుద్వారా బస్టాప్ వద్ద నిరుపయోగంగా ఉన్న డిస్‌ప్లే బోర్డు

పూడిక తొలగింపు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో గెడ్డల నుంచి తొలగించిన పూడికలను ఎట్టకేలకు తరలించారు. గత నెలలో తొలగించిన పూడికను గెడ్డలకు ఇరువైపులా పోగేశారు. రోజులు గడుస్తున్నా.. దాన్ని తరలించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. దీనిపై ఆదివారం 'సాక్షి'లో 'పూడిక తీసి...వదిలేస్తున్నారంతే...!'శీర్షిక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశాల మేరకు పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో వార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆడారి నళిని నేతృత్వంలో పొక్లెయిన్ సాయంతో పూడికలను వాహనల్లోకి వెత్తి, తరలించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

సీతంపేట : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అవార్డు గ్రహీతలను బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ కలిసి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. సత్కారం పొందిన వారిలో కె.వి.డి.నరసింహరావు, పి.రాజారావు, పి.నాగేశ్వరరావు, కె.గంగాధరరావు, ఎస్.రాజేంద్రప్రసాద్, కె.నాగూర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ అవార్డులు కృషికి, క్రమశిక్షణకు, నిజాయతీకి, అంకితభావానికి గుర్తింపుగా నిలుస్తాయన్నారు. విద్యార్థులందరినీ సమ దృష్టితో చూడాలని, ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, మన ప్రవర్తనను విద్యార్థులు నిత్యం గమనిస్తూ ఉంటారన్నారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పుస్తకంలోని పాఠాలే కాకుండా జనరల్ నాలెడ్జి కూడా బోధించాలని సూచించారు. కార్యక్రమానికి బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు.



సన్మాన గ్రహీతలతో జీఎస్ఎన్ రాజు, బాలమోహన్‌దాస్, తదితరులు

300 మందికి వైద్య పరీక్షలు



వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం అక్షయ ఫౌండేషన్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందిని వాకర్స్ సభ్యులు సత్కరించారు. ఎంజీఎఫ్ గౌరవాధ్యక్షుడు మణిభూషణరావు, బలరామ్, ఇమ్మానియేల్, వెంకటరావు, రమేష్ సుకుమార్, అడబాల సత్యనారాయణ, సూర్యారావు, ప్రకాశరావు, ప్రసాద్, నాగరాజు, అచ్చిబాబు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు యువతి



కుటుంబ సభ్యులకు యువతిని అప్పగిస్తున్న పోలీసులు

మద్రిపాలెం : బిహార్‌కి చెందిన యువతిని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కి చెందిన ఒక యువతి మతిస్థిమితం లేక విశాఖ వచ్చేసింది. ఆమె ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల క్రితం రోడ్డుపై ఉండగా పోలీసులు గమనించి చినవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. దీంతో వారు ఆదివారం చినవాల్తేరులోని ఆస్పత్రికి రాగా యువతిని అప్పగించారు. బిహార్ యువతిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఐదో పట్టణ పోలీసులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు.

అనాథలను ఆదుకోవడమే లక్ష్యం



ఆశ్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, అతిథులు

మద్రిపాలెం : అనాథలను అన్నిరకాలుగా ఆదుకుని బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కైరోస్ టెక్నాలజీస్ సీఈవో పెన్నం సుధాకర్ పేర్కొన్నారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో కేర్ అండ్ లవ్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాథలు, నిరాశ్రయులు, మానసిక దివ్యాంగులను ఆశ్రమంలో చేర్చుకుని ఉచిత ఆహారం, చికిత్స అందిస్తారన్నారు. కేర్ అండ్ లవ్ సంస్థ అధ్యక్షుడు పీఎస్ రావు మాట్లాడుతూ, పెన్నం ఫౌండేషన్ ద్వారా అమెరికాలో కూడా ఎంతో మంది దివ్యాంగులతో ఆశ్రమం నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. సుధాకర్ సాయంతోనే ఇక్కడ ఆశ్రమం ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు రమ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం ఎస్‌ఐగా సురేష్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన హార్బర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన భాస్కర్ పీఎం పాలెం లా అండ్ ఆర్డర్‌కు బదిలీ కావడంతో నెలలు తరబడి క్రైం ఎస్ఐ లేకపోవడంతో ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో మరో ఎస్ఐ దేవుడునాయుడు బాధ్యతలు స్వీకరించి వారం రోజులు గడవక ముందే బదిలీపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోయారు.

విద్యుత్ దీపాల వెలుగుల్లో శివాలయాలు



అలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

సీతమ్మధార : కార్తీకమాసం మూడో సోమవారం పూజల కోసం శివాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా సిద్ధం చేశారు. నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. ఇక్కడ డిసెంబర్ 2 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.